పెన్ పవర్
10 YEAR ANNIVERSARY 2014 - 2024
తెలంగాణ రౌండప్
శనివారం 1 మార్చి 2025 పేజీలు 8

# తెలంగాణలో డిజిటల్ హెల్త్ కార్డులు తీసుకొస్తాం



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో రానున్న రోజుల్లో హెల్త్ టూరిజం పాలసీ తీసుకురానున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డా.నాగేశ్వర్ రెడ్డి పద్మవిభూషణ్ అవార్డును పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరైన సీఎం.. తెలంగాణలో డిజిటల్ హెల్త్ కార్డులు తీసుకొస్తామని అన్నారు. తెలంగాణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రతి పెద వాడికి ఆరోగ్యం అందిస్తున్నట్లు సీఎం తెలిపారు. హైదరాబాద్ లో హెల్త్ క్యాంపస్ ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య సదుపాయాలు అందిస్తామని.. అందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనికి డా.నాగేశ్వర్ రెడ్డి - మిగతా 2లో...



## హైదరాబాద్ శివారులో అగ్ని ప్రమాదం...

# ముగ్గురి మృతి

- రెండంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో చెలరేగిన మంటలు
- దట్టమైన పొగ వ్యాపించడంతో ఊపిరాడక ముగ్గురి మృతి
- గ్యాస్ సిలిండర్ పేలడంతో పెరిగిన ప్రమాద తీవ్రత

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ శివార్లలో అగ్ని ప్రమాదం సంభవించి ముగ్గురు మృత్యువాత పడ్డారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలం పుప్పాలగూడలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రెండంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో ఊపిరాడక ముగ్గురు మృతి చెందారు.లంగర్‌హౌస్ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. మొదటి అంతస్తులో చిక్కుకున్న ఇద్దరు మహిళలు, ఒక చిన్నారిని స్ట్రెచర్‌పై బయటకు తీసుకువచ్చారు. వారిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతి చెందిన వారిని ఏడేళ్ల సిజిరా, సహానా (40), జమీలా (70)గా గుర్తించారు. మంటలు చెలరేగడంతో -2లో

## స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడింది కాంగ్రెస్సే..

# దేశాన్ని కాపాడేది కాంగ్రెస్సే



హైదరాబాద్ పెన్ పవర్:టీపీసీసీ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వంద సంవత్సరాల క్రితం గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవి సవీకరించిన రోజు అని అన్నారు. స్వాతంత్ర్య పోరాడింది కాంగ్రెస్సే.. దేశాన్ని కాపాడేది కాంగ్రెస్సే అని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని అన్నారు. ఈ ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తల త్యాగంతో ఏర్పడిందని.. సామాజిక న్యాయం కోసం, మార్పు కోసం పార్టీ కార్యకర్తలు కష్టపడ్డారని అన్నారు. మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. ప్రతి కార్యకర్త పేద వాడి కోసం పని చేయాలని.. పేదల మొఖంలో నవ్వులు చూడాలని.. అప్పుడే మనం పని చేసినట్టని అన్నారు మీనాక్షి. రాహుల్ గాంధీ రాజ్యాంగ రక్షణ కోసం భారత్ జోడో యాత్ర నిర్వహించి ఒక మైదానాన్ని తయారు చేశారని.. మనం దాని కోసం పోరాటం చేయాలని అన్నారు. బీజేపీ, -2 లో

## ఆస్తి పన్ను చెల్లించకుంటే అంతే..

# ఆస్తులు సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ

- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్లు వసూళ్లే టార్గెట్
- మొండి బకాయిదారులపై జీహెచ్ఎంసీ కొరడా
- ఇప్పటికే 200 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేసిన అధికారులు




హైదరాబాద్ పెన్ పవర్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పేరుకుపోయిన పన్ను బకాయిలపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించారు. మొండి బకాయిదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. తొలుత నోటీసులు జారీ చేసి, అప్పటికీ స్పందించకుంటే ఆస్తులను సీజ్ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా (మార్చి 31) రూ.2 వేల కోట్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకుని, ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు రూ.1500 కోట్లకు పైగా ఆస్తి పన్ను వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. టార్గెట్ చేరుకోవడానికి రూ.6 లక్షలకు పైగా బకాయిలు ఉన్న వారికి డిస్ట్రెస్ వారెంట్ నోటీసులు జారీ చేశారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ పన్ను వసూళ్లలో వేగం పెంచారు.నివాస భవనాల పేరుతో అనుమతి తీసుకుని కమర్షియల్ పొంది, వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగిస్తున్న భవనాల యజమానులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. పన్ను తప్పించుకునేందుకు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్న వారికి భారీ మొత్తంలో జరిమానా విధిస్తున్నారు. కాగా, జీహెచ్ఎంసీకి ఆస్తి -2 లో

హైదరాబాద్ పెన్ పవర్: మహాశివరాత్రి జాతరలో వేములవాడ రాజన్నను 2 లక్షల 60 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. మహా శివరాత్రి పర్వదినాన వేములవాడ రాజన్న ఆలయానికి కోటీ 31 లక్షల 89 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కోడె మొక్కుల ద్వారా 45 లక్షల 83 వేలు, ప్రసాదాల ద్వారా 57 లక్షల 12 వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తులకు ఐదు లక్షల లడ్డూలను పంపిణీ చేశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు ఉత్సవాలను -2 లో

## మహా శివరాత్రి ఆదాయంలో వేములవాడ రాజన్న రికార్డు..

# కోటి దాటేసింది..!



# హైదరాబాద్ శివారులో అగ్ని ప్రమాదం... ముగ్గురి మృతి

- మొదటి పేజి తరువాయి

భవనంలో మూడు గ్యాస్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది.

అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ, సాయంత్రం సుమారు ఐదున్నర గంటలకు తమకు ఫోన్ వచ్చిందని, ఘటనాస్థలికి చేరుకొని గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలను అదుపు చేసే సమయంలో ఫస్ట్ ఫ్లోర్‌లో ఐదుగురు చిక్కుకున్నట్లు తెలిసిందని వెల్లడించారు. నిచ్చెన ద్వారా ఫస్ట్ ఫ్లోర్‌కు చేరుకొని, తలుపులను పగులగొట్టి ఒక చిన్నారి, ఇద్దరు మహిళలను బయటకు తీసుకువచ్చామని తెలిపారు. వారిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

# ఆస్తి పన్ను చెల్లించకుంటే అంతే.. ఆస్తులు సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ

- మొదటి పేజి తరువాయి

పన్ను బకాయిపడ్డ వాటిలో పలు ప్రభుత్వ భవనాలు కూడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పన్ను చెల్లించని రూ.200 కోట్ల ఆస్తులను సీజ్ చేసిన బల్దియా.. ఎగవేతదారులపైనా ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు, కోట్ల రూపాయల బకాయిలున్న యజమానులు వన్ టైమ్ సెటిల్మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు.

# తెలంగాణలో డిజిటల్ హెల్త్ కార్డులు తీసుకొస్తాం

- మొదటి పేజి తరువాయి

సహకారం కావాలని కోరుతున్నామని అన్నారు. డా.నాగేశ్వర్ రెడ్డి వైద్య వృత్తిని ఒక బాధ్యత గా తీసుకున్నారని, అందుకే ఆయన ఇంత సాధించగలిగారని అన్నారు. డాక్టర్ అనే వారు రోగులతో కుటుంబ సభ్యుల మాదిరిగా ఉండాలని, ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ తోపాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, ఇతర ఎమ్మెల్యేలు, అధికారులు హాజరయ్యారు.

# స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడింది కాంగ్రెస్సే.. దేశాన్ని కాపాడేది కాంగ్రెస్సే

- మొదటి పేజి తరువాయి

బిఆర్ఎస్ పార్టీలతో మనం పోరాటం చేయాల్సి ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశం కోసం పోరాటం చేసి స్వాతంత్రాన్ని తెచ్చిందని.. కాంగ్రెస్ ఎలాంటి పోరాటానికి అయిన సిద్ధంగా ఉందని అన్నారు.

రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని.. ఇవన్నీ ప్రజలకు సక్రమంగా అందాలని అన్నారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేసారని.. వారికి న్యాయం జరగాలని అన్నారు.పదవులు పొందినవారు ప్రజల కోసం పని చేయాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విదంగా తెలంగాణలో కులగణన చేపట్టామని.. ఇది చాలా గొప్ప విషయమని అన్నారు.గ్రామ గ్రామానికి వెళ్లి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు. గ్రామ గ్రామన పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని..ఈ విషయంలో పీసీసీ పకడ్బందీగా కాలెండర్ సిద్ధం చేయాలని అన్నారు మీనాక్షి నటరాజన్.

# మహా శివరాత్రి ఆదాయంలో వేములవాడ రాజన్న రికార్డు.. కోటి దాటేసింది..!

- మొదటి పేజి తరువాయి

ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 26న జరిగిన మహాశివరాత్రి జాతర కోసం తెలంగాణతో పాటు ఏపీ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ నుంచి భక్తులు తరలివచ్చారు. వేములవాడలో జరిగిన మహాశివరాత్రి జాతర కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బస్సులు నడిపారు. వరంగల్, కోరుట్ల, మెట్‌పల్లి, అర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, కరీంనగర్, నర్సంపేట, హనుమకొండ, హైదరాబాద్, సిరిసిల్ల, హుజూరాబాద్ రూట్లలో మొత్తం 778 ప్రత్యేక బస్సులు నడిపారు. వేములవాడ బస్టాండ్ నుంచి ఆలయం వరకు 24 గంటల పాటు ఫ్రీగా 14 మినీ బస్సులను నడిపారు. ఇదిలా ఉండగా.. ఫిబ్రవరి 15 వరకూ వేముల వాడ శ్రీరాజరాజేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ. 1 కోటి 69 లక్షలు వచ్చినట్టు ఆలయ ఈవో వినోద్ తెలిపారు. ఆలయ ఖజానాకు రూ. 1 కోటి 69 లక్షల76 వేల 867 నగదు, 116 గ్రాముల బంగారం, 9 కిలోల 800 గ్రాముల వెండి సమకూరినట్లు పేర్కొన్నారు.

# దేశ రక్షణ అందరి బాధ్యత:సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్ పెన్ పవర్::** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో విజ్ఞాన్ వైభవ్ 2కే 25 ప్రదర్శనను ప్రారంభించారు కేంద్ర రక్షణమంత్రి, సీఎం రేవంత్ రెడ్డి. సీవీరామన్, అబ్దుల్ కలాం విగ్రహాలకు రాజ్‌నాథ్, రేవంత్ రెడ్డి నివాళులర్పించారు.

ఈ ప్రదర్శనలో %ణ=ణూ%, ఎరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెలెన్స్ సంయుక్తంగా రక్షణ రంగ ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..ఇలాంటి వైజ్ఞానిక ఎగ్జిబిషన్ల ఏర్పాటుతో విద్యార్థులకు రక్షణ వ్యవస్థపై మరింత అవగాహన వస్తుందన్నారు. ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు జరగనుంది.. ఇందులో 200 స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్కూల్స్, ఇంజనీరింగ్ విద్యార్థులతోపాటు 30వేల మందికి ఈ ప్రదర్శన చూసేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రదర్శనలో యుద్ధ పరికరాల పనితీరు , వాటి తయారీ పరిజ్ఞానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. మార్చి 1,2 తేదీల్లో సాధారణ ప్రజలకు ప్రదర్శన సందర్శించేందుకు అవకాశం కల్పించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ , స్పేస్ లపై పరిజ్ఞానంతో పాటు ఈ రంగాల్లో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పిస్తారు.

# లక్ష్యంతో పయనిస్తే లక్ష్య సాధన మీదే వెతుకుంటూ ట్రినిటీ విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యార్థులు ఒక లక్ష్యంతో పయనిస్తే లక్ష్యసాధన మిమ్ములను వెతుక్కుంటూ వస్తుందని ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్ లో శుక్రవారం జరిగిన ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, డిప్లమా పరంపర 2౦25 డిప్లమా ఫేర్వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదన్నారు. ఇప్పుడున్న తరుణంలో టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందని టెక్నాలజీని ఉపయోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు పొందే విధంగా ప్రయత్నించాలని తద్వారా తమ యొక్క తల్లిదండ్రుల కలలను నెరవేర్చిన వారవు తారన్నారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ట్రినిటీ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఏ ఒక్కరు కూడా ఖాళీగా ఉండరని దానికోసం రానున్న రోజుల్లో తమ కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మార్గదర్శకంలో కార్యచరణలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించి ప్రతి విద్యార్థి ఉద్యోగిగా మారేలా దోహద పడతామన్నారు. దీని కోసం గత కొద్ది మాసాలుగా ఇంజనీరింగ్ కళాశాలలో ఫీల్డ్ ట్రిప్ ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాలు నిర్వహించి సాంకేతికపరంగా విద్యార్థులను ఎంతో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివే విధంగా కృషి చేయాలని నిరంతర తపనతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్లమా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేషన్, ఏవో సురేష్,రాజిరెడ్డి, చొప్పరి వంశీ, ఆయా శాఖల అధ్యాపకులు, నటరాజన్, ప్రభాకర్, స్వాతి పద్మిని, చొప్పరి వంశీతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**అధికారులకు సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎల్లప్పుడూ అండగా ఉంటాం పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు కమిషనర్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోల కార్యక్రమం.సిద్దిపేట్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు.మంజూర్ హుస్సే న్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్పై, స్పెషల్ బ్రాంచ్ సిద్దిపేట, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబు ల్, ఏఎస్ఐ, ఎస్ఐ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేయడం జరిగింది. డిపార్ట్మెంట్లో వరకు 42 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినారు.యెల్లు కృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్ఐ ఏఆర్ కానిస్టేబుల్,ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, ఏఆర్ఎస్ఐ అంచలంచలుగా పదవున్నతి పొందారు.ద

ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేయడం జరిగింది. ప్రస్తుతం సిఏఆర్ హెడ్ క్వార్టర్ సిద్దిపేటలో విధులు నిర్వహిస్తూ వరకు డిపార్ట్మెంట్లో 39 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసినారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను అభినందించి సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సర్వీస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం

జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేస్తు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ పత్రాలు అందచేశారు. సిద్దిపేట పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించవచ్చని తెలిపారు.

## పార్టీ కోసం కష్టపడలేని ఎంతటి నేతనైనా పక్కన పెడతాం: సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** పార్టీ కోసం కష్టపడలేని ఎంతటి నేతనైనా పక్కన పెడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పైరవీల ద్వారా పదవులు రావని.. ప్రోగ్రెస్ చూసి పదవులు వస్తాయని అన్నారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ తో పాటు సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పని ప్రోగ్రెస్ చూసే మళ్లీ పదవి రెన్యువల్ చేయడం జరుగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ వ్యాఖ్యలు:

పార్టీలో టికెట్ రాని వాళ్లను, వచ్చిన వాళ్లను ఏకతాటిపైకి తెచ్చాం
జెండా మోసిన 31 మందికి ఒక్క కలం పోటుతో పదవులు ఇచ్చాం
అవకాశం రాని అనుభవజ్ఞులు చాలా మంది ఉన్నారు.
కలిసి పనిచేయడం వల్లే తెలంగాణలో అధికారంలో కి వచ్చాం
పార్టీ కట్టుబాట్లను మీనాక్షి నటరాజన్ ను చూసి నేర్చుకోవచ్చు
ప్రతి కార్పోరేషన్ పదవి కష్టపడ్డ కార్యకర్తకే ఇచ్చాం
ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
జెండా మోసిన కార్యకర్తలకు సముచిత స్థానం వస్తుంది
పైరవీల ద్వారా ఎప్పటికీ పదవులు రావు
ఏఐసీసీ అనుమతితో త్వరలో మరిన్ని పదవులు ఇస్తాం

## ఆరుదైన శస్త్ర చికిత్స చేసిన అత్తాపూర్ జర్మన్ టెన్ ఆసుపత్రి వైద్యులు

**రంగారెడ్డి జిల్లా.... పెన్ పవర్:**అత్తాపూర్ జర్మన్ టెన్ ఆసుపత్రి బృందం ఆరుదైన రికార్డ్ సృష్టించారు. ఎక్కడ కానీ సర్జరీ ఇక్కడ విజయవంతంగా చేసారు. 3 సంవత్సరాల క్రితం వెస్ట్ బెంగాల్ కి చెందిన రషీద్ మియా (11) అనే బాలుడు పటాసు పేలడం తో కుడి చేతి బొటన వేలితో పాటు 2 వేళ్లు, ఎడుమ చేతి లో రెండు వేళ్ళు కోల్పోయాడు. దీంతో హైదరాబాద్ అత్తాపూర్ జర్మన్ టెన్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మీర్ జవాద్ జాఫర్ ఖాన్ అధ్వర్యంలో డాక్టర్ల బృందం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు.రషీద్ కుడి కాలు కు వున్న వేలును తొలిగించి కుడి చేయి బొట్టన వేలు కు అతికించారు. దీంతో రషీద్ మియా కు బోటన వేలు తిరిగి వచ్చి తన పని తాను చేసుకుంటూ వున్నాడు. దాతల సహకారంతో జెర్మన్ టెన్ హాస్పిటల్ యాజమాన్యం సహకారం తో ఈ ఆపరేషాన్ నిర్వహించిన్నట్టు డాక్టర్లు తెలిపారు.

## శవంతో మల్లన్న సాగర్ ముంపు బాధితుల ధర్నా

**సిద్దిపేట: పెన్ పవర్:**గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ముందు శవంతో మల్లన్నసాగర్ ముంపు బాధితులు ధర్నాకు దిగారు. ముంపు గ్రామాల్లో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి స్థలం లేదంటూ ఆందోళన చేసారు. 14 గ్రామాల ప్రజలకు ఆరేళ్లుగా సమస్యగా మారిన చివరి మజిలీ స్థలం. శుక్రవారం ఓ వ్యక్తి చనిపోవడంతో ఎక్కడ అంత్యక్రియలు నిర్వహించాలో అధికారులే చెప్పాలని డీసీఎంలో మృతదేహాన్ని తీసుకువచ్చి ధర్నా చేసారు.

# 100 కోట్ల మంది దగ్గర ఖర్చులకు పైసల్లేవ్.. మరో 30 కోట్ల మంది ఇప్పుడిప్పుడే పైసల్ తీస్తుండ్రు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ జనాభా 140 కోట్ల పైగానే ఉన్నా దాదాపు 100 కోట్ల మంది భారతీయుల సంపాదన అంతంత మాత్రమే. వీళు స్వేచ్ఛగా ఖర్చు చేయలేని పరిస్థితి ఉందని వెంచర్ క్యాపిటల్ సంస్థ బ్లూమ్ వెంచర్స్ అంచనా వేసింది. దేశంలో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వినియోగదారులు కేవలం 13%-%14 కోట్ల మందేనని పేర్కొంది. ఇది మెక్సికో జనాభాకు సమానమని నివేదిక తెలిపింది. మరో 30 కోట్ల మంది ఆశావహ వినియోగదారులని తెలిపింది. అంటే వీరు ఆచి, తూచి ఖర్చు చేసేవారని తెలిపింది. ఇప్పుడిప్పుడే డబ్బులు తీయడం మొదలు పెట్టారని పేర్కొంది. ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో ఇప్పుడున్న వినియోగదారులు ఆర్థికంగా మరింతగా వృద్ధి చెందుతున్నంతగా ఈ వర్గం సైజు మాత్రం విస్తరించడం లేదని తెలిపింది. సంపన్నుల సంఖ్య పెరగట్లేదు. సంపన్నులే మరింత సంపన్నులుగా మారుతున్నారని పేర్కొంది. కొవిడ్ సంక్షోభం తర్వాత కాలంలో ధనవంతుల ఆస్తి మరింత పెరగగా.. పేదలు మరింత పేదరికంలోకి జారుకున్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. వాస్తవానికి ఈ ట్రెండ్ కరోనా సంక్షోభానికి ముందే ప్రారంభమైందని, దేశంలో ఆర్థిక అసమానత పెరుగుతూ వస్తున్నాయని తెలిపింది. దేశ సంపదలో 57.7 శాతం కేవలం 10 శాతం మంది భారతీయుల వద్దే కేంద్రీకృతమై ఉందని పేర్కొంది.

**హాట్ కేకుల్లా బ్రాండెడ్ వస్తువులు**

సంపన్నుల స్వేచ్ఛగా ఖర్చు చేసుకోగలిగే వెసులుబాటు ఉండటంతో వారంతా బ్రాండెడ్ వస్తువులు, ఖరీదైన వాటిపైనే దృష్టి సారించారని దీంతో వాటి అమ్మకాలు ఊపందుకున్నాయని తెలిపింది. అత్యంత విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీల్లో గృహాలు, ఐఫోన్ వంటి ప్రీమియం మొబైల్స్ విక్రయాల్లో అనూహ్య వృద్ధే ఇందుకు నిదర్శనం.
రియల్ ఎస్టేట్ విషయానికి వస్తే అందుబాటు ధరలో లభించే గృహాల ప్రాజెక్టుల వాటా ఐదేళ్ల క్రితం 40% ఉండగా.. ఇప్పుడది 18 శాతానికి తగ్గిందని అంటోంది. మార్కెట్లో బ్రాండెడ్ ఉత్పత్తుల మార్కెట్ వాటా వేగంగా పెరుగుతోందని తెలిపింది. అదే సమయంలో మంచి అనుభూతిని పంచే ఖరీదైన సేవలకు ఒక్కసారిగా గిరాకీ పెరిగిందని తెలిపింది. కోల్డ్ ప్లే, ఎడ్ షీరన్ వంటి పాశ్చాత్య గాయకులు భారత్‌లో నిర్వహించిన లైవ్ షోల టికెట్లు హాట్ కేక్‌ల్లా అమ్ముడయ్యాయి.

## భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రపంచ బ్యాంకు కీలక సూచనలు



**హైదరాబాద్ పెన్ పవర్:**2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. భారత్ అధిక ఆదాయ దేశంగా మారాలంటే 7.8 శాతం వృద్ధి రేటు సాధించాలని ప్రపంచ బ్యాంకు తాజాగా విడుదల చేసిన 'ఇండియా కంట్రీ మెమోరాండం' నివేదికలో పేర్కొంది.
భారత్ వృద్ధి రేటు 7.8 శాతం చేరుకోవాలంటే దేశీయ స్థూల జాతీయ ఆదాయం ప్రస్తుతం ఉన్న దాంతో పోలిస్తే సుమారు ఎనిమిది రెట్లు పెరగాలని తెలిపింది. ఆర్థిక రంగంతో పాటు భూ, కార్మిక రంగంలో సంస్కరణలు అవసరమని అభిప్రాయపడింది. ఇందుకోసం ప్రస్తుత కార్యక్రమాలు కొనసాగించడంతో పాటు నూతన సంస్కరణలను విస్తరించాలని పేర్కొంది. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే సగటు వృద్ధి రేటు 7.8 శాతంగా ఉండాలని పేర్కొంది. వేగవంతమైన సంస్కరణల ద్వారానే ఇది సాధ్యమవుతుందని తెలిపింది.
2000-2024 మధ్య కాలంలో భారత్ వృద్ధి రేటు సగటున 6.3 శాతంగా ఉందని వెల్లడించింది. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారడానికి ఇటీవలి కాలంలో
భారత్ అనేక నిర్మాణాత్మక సంస్కరణలను చేపట్టిందని తెలిపింది. వీటిలో భాగంగానే మౌలిక సదుపాయాల కల్పన, మానవ మూలధనాన్ని మెరుగుపరచడం, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం వంటి సంస్కరణలు చేపట్టిందని వెల్లడించింది.

## నిద్రిస్తున్న వలస కూలీల పైనుంచి దూసుకెళ్లిన ట్రాక్టర్

**భద్రాదిపెన్ పవర్:**
ఇంటి స్థలం ప్రక్కన నిద్రిస్తున్న వలస కూలీలపై నుంచి ఇసుక ట్రాక్టర్ వెళ్లిన ఘటన భద్రాది కొత్తగూడెం జిల్లా చెర్ల మండలంలోని దండుపేట కాలనీ లో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది,
ఇంటి నిర్మాణ స్థలంలో నిద్రిస్తున్న వలస కూలీలపై నుంచి ఇసుక ట్రాక్టర్ తీసుకెళ్లడంతో కుంజం సన్ను(18) అక్కడికక్కడే మృతి ఉండగా మరొకరి పరిస్థితి విషమంగాఉంది, బాధితులు చతిస్గడ్ కు చెందిన వారిగా గుర్తించారు.గాయాల పాలైన వ్యక్తిని భద్రాచలం ఏరియా ఆసుపత్రి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కోడి పందేల నిర్వాహకులపై కేసు



**సూర్యాపేటపెన్ పవర్:**మద్దిరాల మండలం చందుపట్లలో ఓ రైతు వ్యవసాయ భూమిలో గ్రామానికి చెందిన సురేష్, మహేష్, ఊకల్లు గ్రామానికి చెందిన లక్ష్మణ్, శ్రీను, పస్తాల గ్రామానికి చెందిన ఎల్లయ్య, నూతనకల్లుకి చెందిన సైదు వెంకట నాగరాజు కొన్నిరోజులుగా కోడి పందేలు నిర్వహిస్తున్నాడు. నాలుగు పందెం కోళ్లు, 16 కత్తులు, రెండు బైక్ లు, 5సెల్ఫోన్లు, ఆటోతో పాటు రూ. 4800 స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అంతర్గత విభేదాలు లేవు.. ప్రజాస్వామ్యం ఎక్కువ ఉంది



**హైదరాబాద్ పెన్ పవర్:** పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవు.. మా పార్టీలోనే ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందని అన్నారు కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్. తెలంగాణలో పనిచేసే అవకాశం వచ్చింది.. పీసీసీ చీఫ్, సీఎం, ఇతర నేతలు, కార్యకర్తలను కలుపుకొని పనిచేస్తానన్నారు మీనాక్షీ నటరాజన్. పార్టీ పటిష్టతకు, రాజ్యాంగ పరిరక్షణకు అందరం కలిసి పనిచేస్తామన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లఢానికి కృషి చేస్తానన్నారు మీనాక్షి నటరాజన్. పార్టీలో అంతర్గత రాజకీయాలు లేవు..ప్రజాస్వామ్యం కాంగ్రెస్ లో ఎక్కువ..పార్టీలో భిన్నాభిప్రయాలు ఉంటాయి.. అందరి అభిప్రాయాలకు సముచితస్థానం కల్పిస్తూ ముందుకెళ్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారో..ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు.

ఇక కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ చాలా సాదా సీదా వ్యక్తి. దిల్ కుష్ తో కార్యాలయ బయట కార్యకర్తలను కలిసి విష్ చేశారు. బొకేలు ఇస్తుంటే నిరాకరించారు.

## హరీశ్ రావుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎస్ఎల్బీసీ ప్రమాదంపై మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావుకు ప్రశ్నలు సంధించారు. ఈ ప్రమాదం వ్యవహారంలో రాజకీయ దురుద్దేశంతోనే హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పెండింగులో ఎందుకు పెట్టిందో చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హరీశ్ రావును తాను సూటిగా ప్రశ్నిస్తున్నానని, ఈ సొరంగాన్ని 200 మీటర్లు తవ్వి మిగతా దానిని ఎందుకు వదిలేశారు? తక్కువ లాభం వస్తుందనే దీనిని మధ్యలో వదిలేశారా? ఈ సొరంగం నిర్మాణం పూర్తైతే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనా? ఎందుకు రాజకీయాలు చేస్తున్నారని మూడు ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ నేతలు ప్రకృతి విపత్తులను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఎంతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును ఎందుకు పెండింగులో పెట్టారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదని వ్యాఖ్యానించారు. అద్భుతం జరిగితే తప్ప సొరంగంలో చిక్కుకున్న 8 మంది బతికే అవకాశం లేదని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.


# ఫిబ్రవరి 1న రూ.84,490 పలికిన తులం బంగారం ధర.. ఇప్పుడు ఎంతకు పోయిందో చూడండి..





**హైదరాబాద్ పెన్ పవర్:** 2025 ఫిబ్రవరి నెలలో చివరి రోజైన ఫిబ్రవరి 28న బంగారం ధరలు కొనుగోలుదారులకు కాస్తంత ఊరటనిచ్చాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై 540 రూపాయలు తగ్గింది. దీంతో.. హైదరాబాద్ నగరంలో శుక్రవారం(ఫిబ్రవరి 28, 2025) 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర 86,840 రూపాయలుగా ఉంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా 10 గ్రాములపై 500 రూపాయలు తగ్గి 79,600 వద్ద నిలిచింది. ఇక.. ఈ ఫిబ్రవరి నెల 1వ తేదీ నుంచి నెల ముగిసే వరకూ బంగారం ధరల ట్రెండ్ ను ఒక్కసారి పరిశీలిస్తే.. ఫిబ్రవరి 1న 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర 84,490 రూపాయలు. ఇదే బంగారం నెలాఖరుకు 86,840 రూపాయలకు చేరింది. అంటే.. 28 రోజుల్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై 2,350 రూపాయలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం విషయానికొస్తే.. ఫిబ్రవరి 1న 77,450 రూపాయలు ఉండగా.. ఫిబ్రవరి 28న 79,600 రూపాయలు పలికింది. 22 క్యారెట్ల బంగారం ఫిబ్రవరి 1తో పోల్చితే ఫిబ్రవరి 28 నాటికి 2,150 రూపాయలు పెరిగింది. ఇక.. వెండి ధరలను ఒక్కసారి గమనిస్తే.. ఫిబ్రవరి 28న కిలోపై వెండి ధర వెయ్యి రూపాయలు తగ్గింది. ఫిబ్రవరి 27న కిలో వెండి ధర లక్షా 6 వేలు ఉండగా.. ఇవాళ లక్షా 5 వేలుగా ఉంది. బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు పలు అంశాలపై ఆధారపడి ఉంటాయి.గ్లోబల్‌గా అనిశ్చితి నెలకొనడడంతో ఇన్వెస్టర్లు షేర్లు వంటి రిస్క్ ఎక్కువగా ఉన్న అసెట్స్ నుంచి ఫండ్స్ విత్‌డ్రా చేసుకుంటున్నారని, గోల్డ్ వంటి సేఫ్ అసెట్స్‌లో పెడుతున్నారని అనలిస్టులు పేర్కొన్నారు. బంగారం ధరలను ప్రపంచ దేశాల్లో నెలకొన్న పరిస్థితులు, దేశీయ అంశాలు ప్రభావితం చేస్తున్నాయి. సుంకాలపై ఆర్థిక అనిశ్చితి, ఆర్థిక లోటులు, డీడాలరైజేషన్, ట్రంప్ వాణిజ్య విధానాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం ధరల్లో పెరుగుదలను ప్రభావితం చేస్తున్నాయి.బంగారం ధరల పెరుగుదల, తగ్గుదల వంటివి అమెరికా వాణిజ్య విధానాలు, ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, ప్రపంచ మార్కెట్ కదలికలు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ రంగాలలో ఏవైనా ముఖ్యమైన మార్పులు జరిగితే బంగారం ధరలలో మరింత హెచ్చుతగ్గులకు దారితీయవచ్చు.

# ఉత్తరాఖండ్ లో ఘోరం: విరిగిపడ్డ మంచు కొండ .. 47 మంది గల్లంతు..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాఖండ్ లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది.. ఉత్తరాఖండ్ లోని ఛమోలీ జిల్లాలో మంచు కొండ విరిగిపడిన ఘటనలో 57మంది కార్మికులు కొండ కింద చిక్కుకుపోయారు. వీరిలో 10మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు అధికారులు. మిగిలిన 47 మంది గల్లంతైనట్లు సమాచారం.రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం ( ఫిబ్రవరి 28, 2025 ) ఛమోలీ – బద్రీనాథ్ నేషనల్ హైవే సమీపంలోని మనా గ్రామం దగ్గర చోటు చేసుకుంది ఈ ప్రమాదం.

ఘటనాస్థలం దగ్గర రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. పనిలో ఉన్న కార్మికులంతా మంచు కొండల కింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అధికార యంత్రంగం హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఉత్తరాఖండ్ ప్రాంతంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. శుక్రవారం రాత్రి కూడా వర్షం కొనసాగుతుందని.. 20 సెంటీమీటర్ల మేర భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది వాతావరణ శాఖ. భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చే అవకాశం ఉందని.. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ.ఈ క్రమంలో ఉత్తరాఖండ్ లోని పట్టణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది వాతావరణ శాఖ.

# పార్క్ ప్రవేశానికి ఫీజు వసూలు

## మండిపడ్డ ఎమ్మెల్యే మాధవరం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరోగ్యంగా ఉండేందుకు వాకింగ్ చేయాలనుకునే వారికి జిహెచ్ఎంసి షాక్ ఇస్తుంది. కూకట్ జోనల్ పరిధిలోని మూసాపేట్ సర్కిల్లోని పార్కును డెవలప్మెంట్ పేరుతో ప్రైవేట్ ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు ఇచ్చి చుట్టుపక్కల ఉండేవారు పార్కులో వాకింగ్ చేసుకునేందుకు లోపలికి వస్తుంటే వారిని అనుమతించకపోగా వారి వద్ద నుండి రోజుకు 11 రూపాయల చొప్పున నెలకు 220 రూపాయలు వసూలు చేస్తుండడంతో వారి పైన ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే కృష్ణారావు. శుక్రవారం కూకట్ పల్లి నియోజకవర్గం లోని కేపి .హెచ్. బి డివిజన్ వ్యాప్తంగా ఉన్న పార్కులను సందర్శించారు. జిహెచ్ఎంసి పరిధిలోని పైలెట్ ప్రాజెక్టు కింద కేపీహెచ్ బి కాలనీ లోని మలేషియా టౌన్షిప్ వెనకాల ఉన్న స్థలాన్ని 2.5 కోట్లతో అభివృద్ధి చేసి ఇప్పుడు వాటిని వసూలు చేసుకునేందుకు ప్రైవేట్ ఏజెన్సీకి అనుమతి ఇవ్వడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే ప్రజలు కట్టే పన్నుతో జీతాలు తీసుకుంటున్న జిహెచ్ఎంసి అధికారులు ఇలాంటి తీరుల వ్యవహరించడం హేయమైన చర్యని ప్రజలకు

అనుమతించకపోతే వీటికోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హెచ్చరించారు. తమ ప్రభుత్వంలో పార్కులను గ్రౌండ్లను అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం స్థలాలను అమ్ముకుంటూ డబ్బులు ఎలా రాబట్టాలని దానిపైనే దృష్టి పెట్టిందని ఇలాంటి వాటిని ప్రభుత్వం మానకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు.

# స్టాక్ మార్కెట్లో రక్తపాతం.. ఒక్క రోజులోనే రూ.9 లక్షల కోట్ల నష్టం.. నిండా మునిగిన రిటైల్ ఇన్వెస్టర్లు.. ఇప్పుడేం చేయాలి..?

**హైదరాబాద్ పెన్ పవర్:**బ్లాక్ ఫ్రైడే.. (ఫిబ్రవరి 28) స్టాక్ మార్కెట్లో వినిపిస్తున్న పదం ఇది. ఫిబ్రవరి చివరి సెషన్ అయిన ఈ రోజు మార్కెట్లలో రక్తపాతం కనిపించింది. స్మా, మిడ్, లార్జ్ క్యాప్ అంటూ తేడా లేకుండా అన్ని ఇండెక్స్ లు ఘోరంగా కుప్పకూలాయి. మార్కెట్లో ఉన్న అన్ని 13 సెక్టోరియల్ ఇండెక్స్ లు ఇవాళ రెడ్ లో ముగిశాయి. స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్స్ లు ఏకంగా 2శాతం కుప్పకూలాయి. ఒకే సెషన్ లో ఇండెక్స్ 2 శాతం పతనం అంటే చాలా ఘోరమైన ఫాల్ అని చెప్పవచ్చు.

నిఫ్టీ 418 పాయింట్లు పడిపోయి 22,126 దగ్గర స్థిరపడింది. అదే సమయంలో సెన్సెక్స్ ఏకంగా 1420 పాయింట్లు పతనం అవ్వడంతో 73,192 స్థాయికి చేరుకుంది. మార్కెట్లో లిస్ట్ అయిన కంపెనీల్లో కేవలం 400 స్టాక్స్ మాత్రమే అడ్వాన్స్ ఉండగా, 2,221 స్టాక్స్ ఇవాళ డిక్లైన్ అయ్యాయంటే మార్కెట్ ఈ రోజు ఎంత ఘోరంగా పతనం అయ్యిందో ఊహించవచ్చు. మార్కెట్లు వరుసగా 5 నెలలుగా నష్టాల్లో ముగియటం గత 29 ఏళ్లలో ఇదే తొలిసారి.

ఇక ఇండియన్ రూపీ డాలర్ తో పోల్చితే 0.2 శాతం పడిపోయింది. యూఎస్ డాలర్ తో పోల్చితే 87.4 దగ్గర క్లోజ్ అయ్యింది.




**మార్కెట్ క్రాష్‌కు కారణాలు:**

**యూఎస్ ఎకానమీ స్లోడౌన్:**

ఒకవైపు ట్రంప్ టారిఫ్ భయాలతో మార్కెట్లు విలవిలలాడుతుంటే.. యూఎస్ ఎకానమీ స్లో డౌన్ అవుతుందనే వార్త మార్కెట్లను ఉక్కిరిబిక్కిరి చేసింది. యూఎస్ 4వ క్వార్టర్ ఎకానమిక్ డాటా ఇక నుంచి కన్జంప్షన్ తగ్గుతుందనే ఇండికేషన్ ఇవ్వడం మార్కెట్లో భయాలకు కారణం. యూఎస్ ఫోర్త్ క్వార్టర్ జీడీపీ (Q4 US GDP) 2.3 శాతంగా నమోదైంది.

**ట్రంప్ టారిఫ్ భయాలు:**

అదే విధంగా మార్చి 4 నుంచి మెక్సికో, కెనాడా దేశాలపై 25 శాతం, చైనాపై 10 శాతం టారిఫ్ అమలవుతుందని ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించడంతో ప్రపంచ మార్కెట్లు క్రాష్ అయ్యాయి. యూఎస్ మార్కెట్లు కూడా పతనం అంచుల్లోనే ఉన్నాయి. ఈ ప్రభావం ఇండియన్ మార్కెట్లపై తీవ్రంగా పడిందని చెప్పవచ్చు.

**FIIల అమ్మకాలు:**

ఇండియన్ మార్కెట్ నుంచి ఫారిన్ ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలు జరుపుతున్నారు. ఒక్క ఫిబ్రవరి నెలలో రూ.46 వేల కోట్ల రూపాయల అమ్మకాలు జరిపారు. జనవరి, ఫిబ్రవరి కలిపి 2025లో మొత్తం రూ.లక్షా 33 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఇండియన్ మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో ఇండియన్ మార్కెట్లలో ఘోరమైన సెల్ ఆఫ్ కొనసాగుతోంది.

**స్మాల్, మిడ్ క్యాప్ క్రాష్:**

ఇండియన్ మార్కెట్లలో స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్స్ లు భారీగా పడిపోతున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్ల ఫెవరేట్ స్టాక్స్ అయిన స్మాల్, మిడ్ క్యాప్ కంపెనీలు భారీగా పడిపోతుండటంతో భారీ నష్టాలను చవిచూస్తున్నారు. స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్స్ లు ఓవర్ వ్యాల్యువేషన్ లో ఉండటమే అందుకు కారణం అంటున్నారు ఎనలిస్ట్ లు. అయితే బుల్ మార్కెట్ లో హైయర్ వాల్యువేషన్ లో కూడా FII లు పెట్టుబడులు పెడుతుంటారు. బేర్ మార్కెట్లో వ్యాల్యువేషన్ ఒక కన్సర్న్ గా మారటం కామన్ .మార్చి 4 నుంచి టారిఫ్ లు అమలులోకి వస్తాయని యూఎస్ ప్రసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఫిబ్రవరి 27న మరోసారి ఉద్ఘాటించడంతో మార్కెట్లలో అన్ సర్టైనిటీ ఏర్పడింది. దీంతోపాటు డిసెంబర్ క్వార్టర్ రిజల్ట్స్ ఊహించినంగా లేకపోవడంతో రిచ్ వ్యాల్యువేషన్స్ ఉన్నాయని ఫారెన్ ఇన్వెస్టర్లు అమ్మకాలు చేస్తున్నారని ప్రముఖ ఫండ్ మేనేజర్ కునాల్ రాంభియా అభిప్రాయం వ్యక్తం చేశారు.

**నిండా మునిగిన రిటైల్ ఇన్వెస్టర్లు.. ఇప్పుడేం చేయాలి:**

కోవిడ్ 19 ఫాల్ తర్వాత మార్కెట్లలో వచ్చిన రికవరీ.. బుల్ మార్కెట్ జోష్ కారణంగా స్టాక్ మార్కెట్లలోకి కొత్త ఇన్వెస్టర్లు ఎక్కువ మంది వచ్చారు. ప్రపంచంలో ఎలాంటి ఒడిదుడుకులు ఉన్నా అంతగా ప్రభావితం కాని లార్జ్ క్యాప్ స్టాక్స్ వైపు వెళ్లకుండా.. మల్టీ బ్యాగర్ రిటర్న్స్ ఇస్తాయని నమ్మకంతో ఎక్కువగా స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ కంపెనీలలో పెట్టుబడులు పెడుతూ వస్తున్నారు. అయితే ఎంత మల్టీ బ్యాగర్ రిటర్న్స్ ఇస్తాయో.. అంతే మల్టీ బ్యాగర్ లాస్ స్మాల్, మిడ్ క్యాప్స్ కంపెనీల్లో ఉంటుంది. ప్రస్తుతం మార్కట్లో అదే చూస్తున్నాం. ఈ మార్కెట్ క్రాష్ లో స్మాల్ క్యాప్ ఇండెక్స్ 21 శాతం పడగా, మిడ్ క్యాప్ ఇండెక్స్ 16 శాతం ఫాల్ అయ్యింది. దీంతో చిన్న కంపెనీలో 30 శాతం నుంచి 80 శాతానికిపైగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్ట్ ఫోలియోలు ఘోర నష్టాలకు లోనయ్యాయి. మొత్తానికి ఈ క్రాష్ లో రిటైల్ ఇన్వెస్టర్లు ఘోర నష్టో కూరుకుపోయారు. అయితే ఇప్పుడేంచేయాలి అనేది ప్రశ్న. 30 నుంచి 80 శాతం నష్టాల్లో

ఉన్న రీటైల్ ఇన్వెస్టర్లు ఫియర్ తో అమ్మేసుకుంటే నష్టపోవడం పక్కా. పోర్ట్ ఫోలియోలో ఉన్న నష్టం ఒరిజినల్ నష్టం కాదని అంటున్నారు. ఎందుకంటే మళ్లీ రికవర్ స్టార్ట్ అయితే పెట్టిన డబ్బు మళ్లీ రిటన్ వస్తుందని, భయంతో ఇంత నష్టాల్లో అమ్మేసుకోవడం కరెక్ట్ కాదని చెబుతున్నారు. ఒకవేళ పోర్ట్ ఫోలియో ఇంకా నష్టాలకు లోను కాకుండా లభాల్లో ఉంటే తక్షణ అవసరాల కోసం అమ్మేసుకుని.. మార్కెట్ రివర్స్ స్టార్ట్ అయ్యిందనే కన్ఫామ్ అయ్యాక మళ్లీ కొనొచ్చునని ఎనలిస్టులు చెబుతున్నారు. అదే విధంగా ఈ టైమ్ లో యావరేజ్ చేయడం, ఫ్రెష్ బయ్యింగ్ చేయడం కూడా కరెక్ట్ కాదు. ఎందుకంటే ఇంకా మార్కెట్ ఎంత వరకు పడుతుందో క్లారిటీ లేదు. 21, 300 వరకు నిఫ్టీ ఫాల్ ఉండవచ్చని అంటున్నారు. కాబట్టి మార్కెట్ రివర్సల్ కన్ఫామ్ అయ్యే వరకు వేచి చూడటం బెటర్. మార్కెట్ కాస్త కన్సాలిడేషన్ ఫేజ్ ను గమనించి పెట్టుబడి పెట్టవచ్చు. అంతేకాని పడిపోతుంది కదా.. ఆవేశంతో పెట్టుబడులు పెట్టడం కరెక్ట్ కాదు అని చెబుతున్నారు.

# జియో ఎలక్ట్రిక్ సైకిల్ వచ్చేస్తోందా..? ఒక్కసారి ఛార్జ్ చేస్తే చాలు.. 400 కిలోమీటర్లు వెళ్లొచ్చంట..!

**హైదరాబాద్ పెన్ పవర్:**పారిశ్రామిక దిగ్గజం జియో ఈవీ సెగ్మెంట్ లోకి ఎంట్రీ ఇస్తోందని వార్తలొస్తున్నాయి... త్వరలోనే జియో ఎలక్ట్రిక్ సైకిల్ ను లాంచ్ చేయనుందని టాక్ వినిపిస్తోంది. ఇండియన్ కస్టమర్స్ కి తగ్గట్టుగా అధునాతన ఫీచర్లతో, లాంగ్ రేంజ్ బ్యాటరీతో, రూ. 25వేల నుండి 45వేల వరకు మోడల్స్ తో సరసమైన ధరతో జియో ఎలెక్ట్రిక్ సైకిల్ రానుందన్న వార్తలు హాట్ టాపిక్ గా మారాయి. ఒక్కసారి ఛార్జ్ చేస్తే.. 400 కిలోమీటర్ల రేంజ్ అన్నది ఈ సైకిల్ ఫీచర్స్ లో హైలైట్ అని చెప్పాలి. ఇదే గనక నిజమైతే.. ఎలక్ట్రిక్ సైకిల్ సెగ్మెంట్ లో జియో కొత్త బెంచ్ మార్క్ ను సెట్ చేయడం ఖాయమని చెప్పచ్చు. ఈ సైకిల్ లిథియం ఐయాన్ బ్యాటరీతో రానుందని.. దీంతో ఎఫిషియన్సీ, లాంగివిటీ పెరుగుతుందని తెలుస్తోంది. వీటితో పాటు జియో సైకిల్ లో మరికొన్ని బెస్ట్ ఫీచర్స్ ఉండనున్నాయని సమాచారం.




3 నుంచి 5 గంటల ఫుల్ ఛార్జ్ టైంతో ఫాస్ట్ ఛార్జింగ్

రిమూవబుల్ బ్యాటరీ

పర్ఫామెన్స్ ని పెంచే స్మార్ట్ బ్యాటరీ మేనేజ్మెంట్ సిస్టం

**మోటర్ పర్ఫామెన్స్:**

ఈ ఇ-బైక్ 250 నుండి 500 వాట్లతో శక్తివంతమైన ఎలక్ట్రిక్ మోటారుతో వస్తుందని, ఇది అర్బన్ రోడ్స్ తో పాటు తేలికపాటి ఆఫ్-రోడ్ యూసేజ్ కి కూడా సెట్ అవుతుందని తెలుస్తోంది.

సౌకర్యవంతమైన రైడ్ కోసం స్మూత్ యాక్సిలరేషన్

మల్టీ రైడింగ్ మోడ్‌లు (ఎకో, నార్మల్, స్పోర్ట్)

సమర్థవంతమైన ప్రయాణానికి పెడల్-అసిస్ట్ టెక్నాలజీ

జియో ఎలక్ట్రిక్ సైకిల్ గనక లాంచ్ అయితే.. ఈవీ సెగ్మెంట్ లో ఒక రెవెల్యూషన్ వస్తుందనే చెప్పాలి. స్మార్ట్ ఫీచర్లు, ఇంప్రెసివ్ రేంజ్ తో ఉన్న ఈ సైకిల్ సరసమైన ధరకే రావడం ఈ సెగ్మెంట్ కి గేమ్ చేంజర్ లాంటిదని చెప్పాలి. అయితే.. ఈ సైకిల్ ఎప్పుడు లాంచ్ అవుతుంది అన్నది అఫీషియల్ గా క్లారిటీ రావాల్సి ఉంది.

# ఆకట్టుకున్న మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ ఆడిషన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ ? బ్యూటిఫుల్ తెలంగాణ ? ఆంధ్రప్రదేశ్ ఆడిషన్స్ ఆకట్టుకున్నాయి. మాసాబ్ ట్యాంక్ లోని జేఎన్ఎఫ్ యూలో శుక్రవారం నాడు ఉదయం యువతులతో పాటు వివాహిత మహిళల కోసం ఈ పోటీలకు ఆడిషన్స్ జరిగాయి. వీరిలో వైద్యులు, ఐటీ ఉద్యోగులు, ఫ్యాషన్ డిజైనర్లు, ఔత్సాహిక మోడళ్లు, గృహిణులతో పాటు విభిన్న రంగాలకు చెందిన వారు కూడా హుషారుగా పాలుపంచుకున్నారు. అందం, అంతకు మించి ప్రతిభావంతులైన 100 మంది మహిళలు హాజరైన ఆడిషన్స్ కు సినీ నటుడు నోయెల్, మిస్ ఇండియా సెకండ్ రన్నర్ అప్ 2023 నిషితా మిశ్రా, ఫిలాంత్రపిస్ట్ సిద్దూరెడ్డి కందకట్ల, మిసెస్ ఏషియా గ్రేట్ బ్రిటన్ రన్నరప్ ప్రీతి, కతక్ నృత్యారిణి సంధ్య న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జ్యూరీల ప్రశ్నలకు వారు సమాధానాలను సందిస్తూ, ర్యాంప్ వాక్ తో కనువిందు చేశారు. వారి నడక, నడత, శక్తియుక్తులను విశ్లేషణ చేసి 50 మంది ఫైనలిస్ట్స్ ను ఎంపిక చేశారు. ఈ మార్చి 29 న నగరంలో జరుగనున్న గ్రాండ్ ఫినాలే లో ఈ 50 మంది ఫైనలిస్టు పోటీ పడనున్నారని మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ వ్యవస్థాపకురాలు కిరణ్మయి అలివేలు మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఆరోగ్యం పోషకాహారంపై, అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు సాధికారత కల్పించేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. 'మహిళలు తమ అందం మాత్రమే కాక మేధస్సు, శక్తి యుక్తులను గుర్తించి విజయాలు అధిరోహించేలా చెయ్యడం తమ లక్ష్యం గా పేర్కొన్నారు.

## హరీష్ రావు నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదైంది. కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ లోని బాచుపల్లి పోలీసులు బీఆర్ఎస్ నేత హరీష్ రావుపై కేసు నమోదు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు సహా మరో ముగ్గురి నుంచి ప్రాణహాని ఉందని బాచుపల్లి పోలీసులను చక్రధర్ గౌడ్ ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతోష్ కుమార్, హరీష్ రావు, రాములు, వంశీలపై కేసు నమోదైంది. బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం హరీష్ రావు పై 351 (2) ఖీ/చి 3, (5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ -1 వంశీ కృష్ణ, ఏ3 సంతోష్ కుమార్, ఏ4గా పరుశు రాములు పేర్లను చేర్చిన పోలీసులు ఏ2గా హరీష్ రావు పేరు చేర్చారు. గతంలో హరీష్ రావుపై ఫోన్ టాపింగ్ ఆరోపణలు చేశారు చక్రధర్ గౌడ్. తన ఫోన్ ట్యాప్ చేసి తన భార్యతో, బంధువులతో జరిపిన ఫోన్ సంభాషణలను విన్నారని.. కోర్టు చర్యలు తీసుకోవాలని పోలీసులతో పాటు న్యాయస్థానాన్ని సైతం చక్రధర్ గౌడ్ ఆశ్రయించడం తెలిపిందే. తాజాగా హరీష్ రావు సహా కొందరి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది.

# మీనాక్షి నాటరాజన్ పై తెలంగాణ కాంగ్రెస్ కోటి ఆశలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. గాంధీ భవన్ వ్యూహాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలున్నాయి. అయితే ప్రతిపక్షాలు చేసే విమర్శలు, వారి రచ్చకంటే సొంత పార్టీలోనే కుమ్ములాటలు పీక్స్ లో ఉంటాయి. ఏ రోజూ మీడియా బ్రేకింగ్స్ కు తక్కువ కాకుండా మాంచి స్టఫ్ ఇస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బిఆర్ ఎస్ చేసే విమర్శల కంటే సొంతపార్టీ నేతలే తమ పార్టీ మంత్రులు,ముఖ్యమంత్రులపై చేసుకునే విమర్శలే మాంచి ఘాటుగా ఉంటాయి. అంతలా విభేదాలకు కేరాఫ్ అడ్రస్ గాంధీ భవన్ అనేలా తాజా పరస్దితులు తయారయ్యాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్న సమయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జిగా బాధ్యతలు తీసుకుని, తొలిసారి హైదరాబాద్ కు వచ్చిన మీనాక్షీ నటరాజన్ పైనే కాంగ్రెస్ క్యాడర్ గంపెడు ఆశలు పెట్టుకుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికా?రానికి దూరంగా ఉన్నప్పుడు ఇంట్లో గొడవలు సర్దుకున్నాం. ఇప్పుడు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఏంటీ రచ్చ అంటూ కొందరు నేతలు ఇప్పటికే మీనాక్షి నటరాజన్ కు తెలంగాణలో పరిస్దితులు వివరించినట్లు సమాచారం. మీనాక్షి నాటరాజన్ అందరిలాకాదు. విభిన్నమైన నేతల్లో ఒకరామె. మధ్యప్రదేశ్ కు చెందిన ఈమె మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, పార్టీలోనే కొనసాగడం మాత్రమేకాదు. పార్టీ కోసం కష్టపడే ,నిజాయితీ గల నేతల్లో ఈమె ముందు వరుసలో ఉంటారు. హంగు, ఆర్భాటాలకు దూరంగా, అవినీతికి మరింత దూరంగా ఉండే మీనాక్షికి ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ లో విభేదాలను సర్దుబాటు చేయడం



మాత్రమేకాదు, మరోసారి అధికారంలోకి వచ్చేలా ఇప్పటి నుండే కేడర్ ను బలోపేతం చేసేలా అధిష్టానం పెద్ద టాస్క్ ఇచ్చింది. అందుకే అన్నీ ఆలోచించి, ఆ సమర్ధత ఉన్న నేత కాబట్టే మీనాక్ష్మి నటరాజన్ ను రంగంలోకి దింపింది అధిష్టానం. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పార్టీకి మంచి మైలేజి వస్తుందని అధిష్టానం పెట్టుకున్న అంచనాలు అంతలా ఫలించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బయటవాళ్లు సరే, ముందు సొంత పార్టీలోని కొందరు బిసి నేతలే కులగణనపై నిప్పులు చెరుగుతున్నారు. తప్పుల తడకగా ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆరు గ్యారెంటీలు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ , అవి అమలు చేస్తున్నామని చెబుతున్నా, ఆశించిన స్దాయిలో మైలేజ్ పొందలేకపోతోంది. దీనికి తోడు మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి అంటూ ఎత్తుకున్న కొత్త సవాళ్లు తలపోటుగా మారాయి. వీటివల్ల పార్టీకి నష్టం జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది. క్రిందిస్దాయి కేడర్ మనో ధైర్యం సడలకుండా , భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. మరో పార్టీ వైపు వలసలు లేకుండా అడ్డుకట్ట వేయాల్సిన పరిస్దితులున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో కొందరు నేతలు చేస్తున్న విమర్శలు పార్టీలో కులాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. ఇంటి గుట్టు బజారుపాలు అన్నట్లుగా ఇష్టమొచ్చినట్లు నేతలు చేస్తున్న విమర్శలు పార్టీ పరువు తీసేలా ఉన్నాయి. ఏకంగా ముఖ్యమంత్రిని కూడా వదలకుండా సొంత పార్టీలో? అసమ్మతి పీక్స్ కు చేరుకుంది. ఈ నేపధ్యంలో నేతల మధ్య సయోధ్యత కుదర్చడంతోపాటు, హద్దుమీరుతున్న నేతలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు ముఖ్యంగా గతంలో? ఇన్ ఛార్జ్ మార్పుకు ప్రధాన కారణమైన కొత్త,పాత నేతల మధ్య విభేదాలను తక్షణం గాడిలో పెట్టడంతోపాటు, పార్టీని దశాబ్ధాలుగా నమ్ముకున్న క్యాడర్ కు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. ఇలా ఓవైపు ప్రభుత్వ నిర్ణయాల ప్రభావం, మరోవైపు నేతల మధ్య విభేదాలకు ముగింపు ఇప్పుడు తెలంగాణ కొత్త బాస్ మీనాక్షి నటరాజన్ పై ఉంది. కేంద్ర పెద్దలు నమ్మినట్లు పనిరాక్షసిలా పోరాందిన మీనాక్షి,

# మార్క్ చూపించిన మీనాక్షి

**హైదరాబాద్ పెన్ పవర్:** డప్పుచప్పుళు లేవు.. దండలు, సన్మానాలు లేవు, స్పెషల్ ఫ్లయిట్ లేదు.. కన్వాయ్, సెక్యూరిటీ లేదు.. సాధారణ కాంగ్రెస్ కార్యకర్తలా హైదరాబాద్‌లో ల్యాండ్ అయ్యారు. ఆమె పేరే మీనాక్షి నటరాజన్. తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌చార్జ్. వచ్చీ రావడంలోనే తన మార్క్ ఏంటో చూపించారు. టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం కోసం హైదరాబాద్‌కు మీనాక్షి నటరాజన్ వచ్చారు. దిల్‌కుశ్ గెస్ట్‌హౌస్‌లో మీనాక్షి నటరాజన్‌ను కలుసుకున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. సీఎం రేవంత్ వెంట పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ఉన్నారు. అయితే ఈ భేటీకి అద్దంకి దయాకర్‌ను తన వెంట తీసుకెళ్లారు సీఎం రేవంత్. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కాగా, తమ పార్టీలో అంతర్గత రాజకీయాలు లేవని మీనాక్షి నటరాజన్ చెప్పారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయనీ,అందరి అభిప్రాయాలకు సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. అటు మీనాక్షి రాకపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. ప్రభుత్వాన్ని, పార్టీని మీనాక్షి నటరాజన్ సమన్వయం చేస్తారని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి అన్నారు. పార్టీలో ఇప్పటి వరకూ జరిగిన వాటి గురించి మర్చిపోండి. ఇకపై మీనాక్షి ఆధ్వర్యంలో కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. మీనాక్షి నటరాజన్ బాగా పనిచేస్తారనే నమ్మకం ఉందని జగ్గారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

# మాజీ మంత్రి హరీష్ రావు పై మరో కేసు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదు అయింది బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్ రావు ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ, ఏ -2 గా హరీష్ రావు, ఏ-3 సంతోష్ కుమార్, ఏ -4 గా పరుశు రాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్, ప్రకారం కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో అరస్టయి బెయిల్‌పై విడుదల అయిన సమయంలో వంశీకృష్ణ జైలు వద్ద మీడియాతో మాట్లాడారని దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట పోలీసులను విమర్శించడంతోపాటు, తనపై ప్రతీకారం తీర్చుకుంటామని వంశీకృష్ణ మాట్లాడి నట్లు చక్రధర్ గౌడ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి అభ్యంతకరమైన మాటలు లేవని తనను అక్రమం గా కేసులు పెట్టి జైలుకు పంపించారని, న్యాయపోరాటం కొనసాగిస్తానని చెప్పడం వలనే తనపై అక్రమంగా కేసులు పెట్టారని వంశీ చెబుతున్నారు. కాగా ఈ కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తు ఎలా ఉండబోతోందో చూడా లి.గత ప్రభుత్వానికి అడ్డు తగిలిన వ్యక్తులను ఒక్కొక్కరిగా చంపేసుకుంటూ వస్తున్నారని, వాళ్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని ఆ పార్టీ నేత చక్రధర్ గౌడ్ అన్నారు. తనకూ ప్రాణహాని ఉందని తన అంతు చూస్తామంటూ సోషల్ మీడియా వేదికగా బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం కోసం కొట్లాడుతున్న గొంతుకలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. చావు ఏదో ఒకరోజు తప్పదు. కానీ సమాజం కోసం పోరాడి చావడానికి సిద్ధమేనన్నా రు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యక్తి స్వేచ్ఛను హరిం చారని కోర్టు మెట్లెక్కిన మొట్టమొదటి వ్యక్తిని తానేనన్నారు. కేసు వెనక్కి తీసుకోమని కొన్ని శక్తులు తనను వెంటాడుతున్నాయన్నారు. ఈ క్రమంలో తనకు ఏమౌతుందోనని తన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు.కాగా మాజీ మంత్రి హరీష్‌రావు తన ఫోన్‌తో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల ఫోన్‌లను ట్యాప్ చేయించాడని సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. తన ఫోన్ ట్యాప్ అయిందంటూ గత ఏడాది జూన్ 19న చక్రధర్‌గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోక పోవడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు చక్రధర్‌గౌడ్‌ను గతంలో విచారించిన పోలీసులు సరైన ఆధారాలు తీసుకు రావాలని సూచించారు. ఈ మేరకు చక్రధర్‌గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీని కలిసి ట్యాప్ అయినట్టు అనుమానిస్తున్న సెల్‌ఫోన్‌తో పాటు యాపిల్ కంపెనీ నుంచి ఫోన్ ట్యాప్ అయిందని వచ్చిన మెయిల్ కాగితాలు, ఇతర వివరాలను విచారణ అధికారులకు అందచేశారు. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాననే కక్షతో తనపై అనేక కేసులు పెట్టి జైలుకు పంపించారని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంగనాయకసాగర్ కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది తానేనని ఆయన వెల్లడించారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సైన్స్ ఫేయిర్‌లు దోహదపడతాయి

## నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యార్థులు భవిష్యత్ తరాలకు చెందిన శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో దోహదపడతాయని నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీజేపీ సీనియర్ నేత ప్రముఖ వైద్యులు చిట్నేని రఘు పేర్కొన్నారు. పట్టణంలోని నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్ లో శుక్రవారం నేషనల్ సైన్స్ డే సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్ ఫో కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విధమైన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించడం అనేది చాలా గొప్ప విషయం అన్నారు. ఇందులో దాదాపు 1,000కి పైగా ప్రాజెక్టులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ఆధునిక కాలంలో వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చే విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరింత ప్రోత్సహించాలని కోరారు. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో ప్రజలు మిడిమిడి నమ్మకాలను నమ్మకుండా నిరోధించడంలో ఇలాంటి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అదే విధంగా నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్ యాజమాన్యం 25 సంవత్సరాలుగా ఇక్కడి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనను అందిస్తున్నారన్నారు. జగిత్యాల జిల్లాలోనే నెంబర్ వన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలగా గుర్తింపు పొంది ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటను వేసిందన్నారు. ఇప్పటివరకు సుమారు రెండు వేలకు పైగా విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించడం విశేషమని, ఇక్కడ చదువుకున్న వారిలో సుమారుగా 85 మంది విద్యార్థులు వైద్య వృత్తిలో, 100 వందమంది విద్యార్థులు ఇంజనీర్లుగా సేవలు అందిస్తూ ఉండడం అభినందనీయమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ లో కూడా ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంపికవడం చాలా గొప్ప విషయమని,

సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారిగా మరో విద్యార్థి పనిచేస్తుండడం విశేషమని అన్నారు. అంతేకాకుండా అమెరికా, లండన్, జర్మనీలాంటి దేశాల్లో సైతం ఇక్కడి విద్యార్థులు వివిధ విభాగాల్లో పనిచేస్తుండడం హర్షణీయమన్నారు. ఇప్పటివరకు పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించడం పాఠశాల యొక్క గుర్తింపును రెట్టింపు చేస్తుందని, భవిష్యత్తులో మరింతమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కాగా విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఈ సైన్స్ ఫెయిర్ ఉపయోగపడుతుందన్నారు. సైన్స్ ఫేయిర్ ద్వారా విద్యార్థుల క్రియేటివిటీ వెలికి వస్తుందన్నారు.విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా పని చేయాలని, ప్రతి విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించడం గురువుల బాధ్యత అని, విద్యార్థులు ఇక్కడే కాకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇప్పటి నుంచే జీవితంలో పెద్ద పెద్ద గోల్స్ క్రియేట్ చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఇప్పుడు కష్టపడి, ఇష్టపడి చదువుకుంటేనే భవిష్యత్తు బంగారు బాటవుతుందని, 25 సంవత్సరాలు ఇష్టపడి చదివితే మిగతా 75 సంవత్సరాలు మంచి జీవితాన్ని పొందవచ్చన్నారు. ఇతర రంగాల్లో విజయం సాధించిన వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను ఈజీగా సాధించవచ్చన్నారు. అనంతరం పాఠశాల నిర్వాహకులను నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి సత్కరించారు. కాగా ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు గారిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గారు, పాఠశాల వ్యవస్థాపకులు, మండల విద్యాధికారి మేకల చంద్ర శేఖర్, ప్రధానోపాధ్యాయులు వీ.బీ మహర్షి, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, న్యాయవాది ఆకుల ప్రవీణ్, నాయకులు జియా హుల్ హక్, మార్గం హన్మాండ్లు, అంగడి పురుషోత్తం, బర్ల రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రీసర్వేలో కూడా పాల్గొనని కేసీఆర్ ఫ్యామిలీ



**హైదరాబాద్ పెన్ పవర్:**రీసర్వేలో కూడా పాల్గొనని కేసీఆర్ ఫ్యామిలీ తెలంగాణ సర్కారుకు కేసీఆర్ ఫ్యామిలీ మరోసారి షాకిచ్చింది. కుల గణనలో పాల్గొనని వారికి తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 16 నుండి 28 వరకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. శుక్రవారం తో రెండో దఫా కులగణన సర్వే ముగిసింది. ఈ 12 రోజుల్లో కేవలం 15 వేల కుటుంబాలే సర్వేలో పాల్గొన్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే రీసర్వేలో కూడా కేసీఆర్ కుటుంబం పాల్గొనలేదని వారు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు పై విచారణ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ రాధా కిషన్‌రావు లాయర్ కీలక వాదనలు

ఫోన్ ట్యాపింగ్ కేసుపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తనపై నమోదైన ఎఫ్ ఐ ఆర్ కొట్టివేయాలంటూ రాధా కిషన్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో మరో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు నడుస్తోందని రాధాకిషన్ రావు తరఫు న్యాయవాది వాదించారు. ఆ కేసులో రాధాకిషన్ బెయిల్‌పై బయటికి వచ్చారని చెప్పారు. అదే తరహా ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని వాదించారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన చక్రధర్ గౌడ్ కాంగ్రెస్ నాయకుడని అతనిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వాదనలు వినిపించారు.

## మార్చి 6న తెలంగాణ కేబినెట్ భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ కేబినెట్ మార్చి 6న భేటీ కానుంది సీఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం కాబోతున్న మంత్రివర్గం పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహణ, బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అలాగే కొత్త రేషన్ కార్డుల పంపిణీ, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కేబినెట్ డెసిషన్ తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

# అయోమయం గందరగోళం

**పెద్దపల్లి పెన్ పవర్:**అయోమయం గందరగోళం మధ్యన ఉదయం 8 గంటలకు ఎమ్మెల్సీ పట్టభద్రులు, టీచర్ల ఎన్నికలు ప్రశాంతంగా ప్రారంభమైన అధికారుల నిర్లక్ష్యంతో కొత్తగా తమ పేర్లు నమోదు చేసుకున్న వారు, పాత పట్టభద్రుల ఎన్రోల్మెంట్ విషయంలో పలు లోపాలు స్పష్టంగా కనిపించాయి. ఇందులో కొందరి పేర్లు గల్లంతు కాగా మరికొందరివి తప్పుడు అడ్రస్ లతో నమోదు చేయడం గమనార్హం. దీంతో అడ్రస్ లు దొరకడం లేదంటూ బీ ఎల్ ఓలు చేతులెత్తేశారు. ఫోన్ ద్వారా అడ్రస్ లు వాకబు చేసుకోగా అమర్ నగర్ కు చెందిన ఓ పట్టభద్రుని అడ్రస్ సుభాష్ నగర్ లోని మరో అడ్రస్ పేరు మీద రావడం విశేషం. మరి కొందరి అసలు ఓటరుగా నమోదు చేయనే లేదు. బీఎల్ ఓ లు కూడా రేపు పోలింగ్ ఉందనగా మరుసటి రోజు పోలింగ్ చిట్టీలు పంపిణి చేయడం కొసమెరుపు.



పట్టభద్రులకు ఆయా అభ్యర్థుల నుండి దండిగా ఫోన్ లు, మెసేజ్ లు వచ్చినా పోలింగ్ చిట్టీలు రాకపోవడంతో సదరు ఓటర్లు కూడా పట్టనట్లుగా వ్యవహారించారు.

**మూడు నెలల ముందు నుండే**

జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాలు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన మూడు నెలల ముందు నుండే జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష పలు శాఖల అధికారులు, సిబ్బందితో నిత్యం సమీక్షలు, సమావేశా లు నిర్వహించడం గమనార్హం. ఎక్కడ ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు పలు మార్లు ఆదేశాలు జారీ చేశారు. కొత్త ఓటర్ల నమోదుపై కూడా ఆయా నమోదు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టినా, అధికారుల నిర్లక్ష్యం మూలం గా తూతు మంత్రంగానే చేశారు. పేర్ల నమోదు మొదలుకొని, అడ్రస్ ల వరకు అంతా తప్పుల తడకనే. ఇక బీఎల్ ఓ ల విషయమైతే మరీ అద్వానంగా మారింది. కరెక్ట్ అడ్రస్ లు ఉన్న వారికి ఫోన్ లు చేసి వారి వద్దకే పిలిపించు కొని ఓటరు చిట్టీలు అందించారు. మీ ఇష్టం ఉంటే వచ్చి తీసుకెళ్లండి అనే తరహాలో ఓటర్లతో సంభాసించడం కూడా అధికారుల నిర్లక్ష్యాన్ని చూపిస్తున్నది. జిల్లాలో దాదాపు 31 వేల గ్రాడ్యుయేట్ ఓటర్స్, 1100 మంది టీచర్ ఓటర్స్ ఉన్నారు. ఎన్నికల భాద్యతలు తీసుకున్న అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయడం మరిచి పోయారు. అక్కడ అడ్రస్ ల నమోదు, ఇక్కడ బీఎల్ ఓల పనితీరుపై పలువురు పట్టభద్రులు ఆగ్రహం వ్యక్తం చేయడం పలు పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించింది. దీనిపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించా లని పలువురు పట్టభద్రులు కోరుతున్నారు.

ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువు రు చర్చించుకోవడం కనిపించింది.

కాంగ్రెస్ నుండి ఓటుకు రూ. 1500 అంటూ జోరుగా ప్రచారం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయించే బాధ్యతను ఆయా వార్డుల మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జిలకు అప్పగించా రు. ఇక వారి వద్ద ఉన్న డేటా మేరకు సదరు ఓటరుకు రూ. 1500 పంచినట్లుగా విశ్వసనీయ సమాచారం. అయితే పలువురు అడ్రస్ లు తప్పుగా నమోదు కావడం, మరో వార్డుకు వెళ్లడంతో సదరు ఇంచార్జ్ లకు డబ్బుల పంపిణి విషయంలో తలనొప్పి గా మారిందనే ప్రచారం జోరుగా సాగింది. పలువురు పట్టభద్రులకు ఫోన్ ద్వారా పిలిచి డబ్బులు ఇచ్చారని, మరికొందరు తమ పేర్లు లిస్టులో లేదంటూ, ఆయా ఇంచార్జిలను కలవండంటూ చేతులు దులుపుకోవడం గమనార్హం. ఇక గ్రామాల్లో పట్టభద్రులకు రూ. వెయ్యి చొప్పున పంపిణి చేయగా, మరి కొంతమందికి రూ. 2 నుంచి రూ. 4 వేల వరకు పంపిణి చేసినట్లు జోరుగా ప్రచారాలు సాగాయి.

డబ్బులు పంచుతున్నా రంటూ బీజేపీ నాయకుల ఆందోళన

జూలపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నాయకులు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారంటూ బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు.

ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టేముక్కల సురేష్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. స్థానిక పోలీసులు వారికి మద్దతుగా ఉన్నారంటూ ఏసీపీకి ఫోన్ లో ఫిర్యాదు చేశారు. పోలింగ్ చిట్టీలు పంచుతున్న నాయకుల జేబులు పరిశీలించండి అంటూ పోలీసులు మీద సురేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు**

ఉదయం 8 గంటలకు ప్రాంభమైన ఎమ్మెల్సీ ఎన్నికలు అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. రామ గుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లాలో డిసిపీ చేతన ఆధ్వర్యంలో ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో భారీ బందోబస్త్ మధ్యన టీచర్లు, పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లు ఓట్లు వేశారు. కాగా ఉదయం 10 గంటల వరకు గ్రాడ్యుయేట్స్ ఎన్నికల లో పురుషులు 1467 మంది, మహిళలు 621 మొత్తం 2088 మంది ఓటర్లు అనగా 6.73 శాతం, టీచర్స్ ఎన్నికలలో పురుషులు 100 మంది, మహిళలు 52 మొత్తం 152 మంది ఓటర్లు అనగా 13.68 శాతం పోలింగ్ జరిగింది. కాగా పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రులు 68 శాతం వరకు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. మొత్తంగా ఎన్నికలు సజావుగా జరగడం పట్ల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు....

# ఆర్థిక క్రమశిక్షణతో కూడిన పొదుపే భవిష్యత్తుకు భరోసా

**జగిత్యాల, పెన్ పవర్:**రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో శుక్రవారం జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ బి. ఎస్. లత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ తమ ఆదాయ వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎదుటి వారిని చూసి ఆడంబరాలకు పోయి తమ ఆర్థిక స్తోమతకు, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తున్నారని తద్వారా వాటి కోసం అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమవుతున్నారని కొన్ని కొన్ని సందర్భాల్లో ఆర్థిక సమస్యలు ఆత్మహత్యలకు కూడా5దారి తీస్తున్నాయని ఆమె చెప్పారు. కాబట్టి ప్రతి వ్యక్తి తమ కుటుంబ బడ్జెట్ రూపకల్పన చేసుకోవాలన్నారు. తద్వారా తాము చేసే ఖర్చులు తగ్గించి పొదుపు చేయడానికి దోహదపడుతుందని ఆమే సూచించారు. ఆనంథరం



జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి సంపాదన ముఖ్యమే కానీ ఎంత సంపాదిస్తున్నమన్నది ముఖ్యం కాదని ఎలా ఖర్చు చేస్తున్నామన్నదే ప్రధానం అని.. దాని పైనే మన వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు పొదుపు చేయడానికి బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ రంగ సంస్థలను మాత్రమే ఎంచుకోవాలని అప్పుడే మీ పొదుపు డబ్బులకు సరైన భద్రత, భరోసా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి సత్యమ్మ, బిసి సంక్షేమ అధికారిణి సునీత, జిల్లా ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు

# మార్చి 28న తలపెట్టిన చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

**జగిత్యాల, పెన్ పవర్:**మార్చి 28 న ఏఐటీయూసీ తలపెట్టిన చలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మాడిశెట్టి కిరణ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ నాయకులు చలో పార్లమెంటు పోస్టర్ ను ఆవిష్కరించారు..




ఈ సందర్భంగా స్టేట్ కౌన్సిల్ మెంబర్ మాడిశెట్టి కిరణ్ మాట్లాడుతూ

ప్రస్తుతం ఉన్న సంక్షేమ చట్టంలో నిబంధనలు ఆయా రాష్ట్రాలకు అనుకూలంగా మార్పులు చేసుకునే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. నష్టపరిహారంతో పాటు, 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్, వలస కార్మికులు (ఒక రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాల్లో పనిచేయు వారికి) దేశంలో ఎక్కడైనా వరించే విధంగా గుర్తింపు కార్డులు ఉండాలని, సంక్షేమ బోర్డులను రద్దు చేసే ప్రతిపాదన ఉపసంహరించు కోవాలన్నారు.

ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మార్చి 28న "ఛలో ఢిల్లీ" కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరండని ఏఐసిబిసిడబ్ల్యు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో

జిల్లా సెక్రటరీ రామిల్ల రాంబాబు, సలహా దారు మునిగురి హన్మంత్, సహాయక కార్యదర్శి మల్లారపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు మామిడి రాజన్న, క్యాషియర్ పూదరి మల్లేశం, ప్రవీణ్, పనగంటి మల్లారెడ్డి, సతీష్ రావు, వెన్న మహేష్,అందె ప్రశాంత్,వెన్న మనీతేజ, రంజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.